అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
గురువారం 15 జూన్ 2023 పేజీలు : 04

# జగనన్నకు చెబుదాం వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ , జాయింట్ కలెక్టర్



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఎస్‌పి, జిల్లా అధికారులు

**అనంతపురం కలెక్టరేట్, జూన్ 14 ప్రభాతవార్త**

జగనన్నకు చెబుదాం, గడపగడపకు మన ప్రభుత్వం పనులు, బిల్లుల అప్లోడ్, ఉపాధి హామి పనులు, లేబర్ బడ్జెట్, గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, డా.వైఎస్ఆర్ హెల్త్ క్లీనిక్‌లు, ఎఎంసియులు మరియు బిఎంసియులు, వైఎస్ఆర్ డిజిటల్ లైబ్రరీలు భవన నిర్మాణాలు, జగనన్న హౌసింగ్ ప్రోగ్రాం, వ్యవసాయం మరియు నీటి పారుదల, వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు మరియు భూరక్ష పథకం, తదితర అంశాలపై వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పలు సూచనలు ఆదేశాలు జారీ చేశారు. అనంతపురం కలెక్టరేట్ ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి వీడియోకాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి, రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమీషనర్ మరియు జగనన్నకు చెబుదాం కార్యక్రమం జిల్లా స్పెషల్ ఆఫీసర్ హెచ్.అరుణ్‌కుమార్, జిల్లా ఎస్‌పి శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ పాల్గొన్నారు. వీడియోకాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలను జిల్లాకు సంబంధించి ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపై దృష్టిని సారించాలని ఆదేశించారు. ముఖ్యంగా జగనన్నకు చెబుదాం 1902 ద్వారా వచ్చే ఫిర్యాదులను పారదర్శకంగా ప్రజల్లో సంతృప్తికర స్థాయి పెరిగేలా ఫిర్యాదులను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ విషయంలో తాను అనేక మార్లు చెబుతున్నప్పటికి ఆయా శాఖల అధికారులు అలసత్వం ప్రదర్శించడం సరికాదన్నారు. విధి నిర్వహణలో అలసత్వం మిగతా 4 లో





































# రాష్ట్రంలో ఎక్కడా ఇలాంటి సహకార డెయిరీ లేదు

- రాప్తాడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కృషితో అమ్మ సహకార డెయిరీ
- అమ్మడెయిరీ ప్రారంభంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- తల్లిపాలంత స్వచ్ఛంగా అమ్మడెయిరీపాలు ఉంటాయన్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



అమ్మడెయిరీ లోగోని ఆవిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



డెయిరీ ప్రారంభిస్తున్న దృశ్యం

**అనంతపురం, జూన్ 14 ప్రభాతవార్త బ్యూరో**

రాష్ట్రంలో ఎక్కడా మహిళా సహకార డెయిరీ లేదు. ప్రప్రథమంగా రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఎంతో కష్టపడి ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాడు అని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. అనంతపురంరూరల్ మండలం ఆలమూరు జగనన్న లే ఔట్ పక్కన ఏర్పాటు చేసిన అమ్మపాలడెయిరీ ప్రారంభం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి దంపతులతో వేద పండితులు ఘనంగాయాగం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉషాశ్రీ చరణ్, విప్‌కాపు రామచంద్రారెడ్డి, ఎంపిలు గోరంట్ల మాధవ్, తలారి రంగయ్య, ఎమ్మెల్సీలు శివరామిరెడ్డి, మంగమ్మ, ఎమ్మెల్యే పెద్దారెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి, ఏపి ప్రభుత్వ విద్యా సలహాదారులు ఆలూరు సాంబశివారెడ్డి, జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ, పార్టీ జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, మేయర్ వసీం,మాజీ మేయర్ రాగే పరుశురాం, ఏడిసిసి బ్యాంకు చైర్మన్ లిఖిత, డిప్యూటీ మేయర్ కొగటం విజయభాస్కర్‌రెడ్డి, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, ఉర్దు అకాడమీ చైర్మన్ నదీమ్ అహ్మద్, రాష్ట్ర రాజకాభివృద్ధి చైర్మన్ చాకలి రంగన్న, ఆర్టిసి జోనల్ చైర్మన్ మంజుళ, నాటక మండలి చైర్మన్ చామలూరు హరిత, వైఎస్ఆర్‌సిపి సీనియర్ నాయకులు తోపుదుర్తి ఆత్మరామిరెడ్డి, తోపుదుర్తి రాజవేఖర్‌రెడ్డి, తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి, చవ్వా రాజశేఖర్‌రెడ్డి, రవిశేఖర్‌రెడ్డితోపాటు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న వేలాది మంది డెయిరీ సభ్యులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. అనంతపురం రుద్రంపేట బైపాస్ నుంచి ఆలమూరు వరకు వాహనాల రాకపోకతో ట్రాఫిక్ జామ్ అయింది. డెయిరీని ప్రారంభించిన ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనంతరం అమ్మ డెయిరీ లోగోను ఆవిష్కరించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. 20 కోట్ల రూపాయలతో డెయిరీని ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి అభినందనలు. దీంతో ప్రైవేట్ డెయిరీల దోపిడీకి అడ్డుకట్ట పడుతుంది. నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతున్న మిగతా 4 లో













# సమస్యల పరిష్కారంలో ప్రజల సంతృప్తి ముఖ్యం

- హౌసింగ్ కాలనీలు త్వరితగతిన పూర్తి చేయాలి - ఖరీఫ్ సాగుకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలి - జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు



వీడి కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, సంయుక్త కలెక్టర్, అడిషనల్ ఎస్‌పి, డిఆర్ఓ తదితరులు



పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

**శ్రీసత్యసాయిజిల్లా, జూన్ 14, ప్రభాతవార్త ప్రతినిధి:**

సమస్యల పరిష్కారంలో ప్రజల సంతృప్తి ముఖ్యమని, జగనన్నకు చెబుదాం, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వచ్చే సమస్యలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, వాటికి సత్వర పరిష్కారం చూపాలని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి తాడేపల్లి సిఎం క్యాంపు కార్యాలయం నుండి జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష, గడపగడపకు మన ప్రభుత్వం, ఉపాధి హామీ పథకం, వ్యవసాయానిక సాగునీరు విడుదల, హౌసింగ్ తదితర అంశాలపై ముఖ్యమంత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ నందు పుట్టపర్తి కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, సంయుక్త కలెక్టర్ టి.ఎస్.చేతన్, డిఆర్ఓ కొండయ్య, అడిషనల్ ఎస్‌పి విష్ణు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మధులత, తదితరులు పాల్గొన్నారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ, జగనన్న సురక్ష జూన్ 23న శ్రీకారం చుట్టనున్నట్లు ముఖ్యమంత్రి తెలియజేశారన్నారు. ఒక తేదిని ముందుగా నిర్ణయించి మండల, సచివాలయ పరిధిలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు, జగనన్న సురక్ష అర్జీల పరిష్కారం చేయాలన్నారు. ఆ మేరకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాల్సి ఉంటుందన్నారు. ఉపాధిహామీ పథకం క్రింద చేపడుతున్న పనులకు కనీసవేతనం రాష్ట్ర సగటుకు తగ్గకుండా ఫీల్డ్ అసిస్టెంట్లు పనులు గుర్తించి చేపట్టాలన్నారు. ఉదయం 06:30 నుండి 11:00 గంటలలోగా, సాయంత్రం 03:00ల నుండి ఆయా పనులు చేపట్టి సగటు వేతనం రూ.270లు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. జగనన్న హౌసింగ్ కాలనీల నిర్మాణాలను నిధులు ఇబ్బంది లేనందున త్వరితగతిన పూర్తి చేయాలని, ఇంటి నిర్మాణం కోసం ఎప్పటికప్పుడు నిధులు లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా జమచేయడం జరుగుతుందన్నారు. ఇంటి నిర్మాణాలు పూర్తయిన చోట, టిడ్కో గృహాలకు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఖరీఫ్ సీజన్లో సాగు కొరకు నీటి విడుదలకు మిగతా 3 లో

# ప్రజా మద్దతుతో ఒంటరిగానే పోటీ చేస్తున్నాం..

- పొత్తు లేకుంటే ఎన్నికల్లో పోటీ కూడా చేయలేడు చంద్రబాబు - మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి





జిల్లా నేతలతో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,మంత్రి పెద్దిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిగిన జడ్పి చైర్మన్ గిరిజమ్మ

**అనంతపురం సిటీ, జూన్ 14 ప్రభాతవార్త**

రాష్ట్రంలో ప్రజాబలం, దేవుని ఆశీస్సులు జనం జైజైలు ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బలంగాఉన్నాయని అదే ధీమాతో 2024 ఎన్నికల్లో ఒంటరిగానే తమ పార్టీ పోటీ చేస్తుందని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. అనంతపురం నగరంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో బుధవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. తమ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒంటరిగానే పోటీ చేయాలన్న ఒకే ఒక ఆలోచనతోనే ఉన్నారన్నారు. ఎన్ని పార్టీలు కలిసినా తమకు వచ్చిన ఇబ్బంది ఏమీ లేదన్నారు. 2014 ఎన్నికల ముందు వరకు టీడీపీ, బిజెపిలు కలిసి ఉన్నాయని, 2019 ఎన్నికల ముందు విడిపోయారన్నారు.

అయితే 2024 ఎన్నికలకు మళ్లీ కలవాలన్న కొత్త ఆలోచనతో టీడీపీ, బిజెపి ఉన్నట్లు కనిపిస్తోందన్నారు. రాజకీయంగా ఒంటరిగా పోటీ చేసే శక్తి లేని వ్యక్తి చంద్రబాబు అని పొత్తు లేకపోతే ఎన్నికల్లో పోటీ కూడా చంద్రబాబు చేయడని ఎద్దేవా చేశారు. ఎన్ని పార్టీలు కలిసినా వైసీపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. అంతకు మునుపు జిల్లా మంత్రి ఉషాశ్రీ చరణ్ జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదా రులు ఆలూరు సాంబశివారెడ్డి, నగర మేయర్ వసీం, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మధన్‌మోహన్‌రెడ్డి, శ్రీదేవిల తోపాటు పలువురు నేతలు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.

02ATP27_02ATP27.qxd 14-06-2023 PM 10:25 Page 1



## రక్తదాతలను అవార్డులతో సన్మానించిన రెడ్‌క్రాస్ అధ్యక్షురాలు కాపు భారతి


అవార్డు అందుకొంటున్న చన్నమల్లప్ప

**బ్రహ్మసముద్రం జూన్ 14 ప్రభాతవార్త, :** రక్తదాన దినోత్సవం సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు కాపు భారతి రక్తదాన దాతలకు అవార్డులతో సత్కరించారు. అనంతపురం జిల్లా వ్యాప్తంగా రక్తదాన దాతలు రక్తదాన సేవల్లో ముందుండి నడిపించిన దుర్గం రక్తదాతల సంస్తనుండి ప్రముకుల సమక్షంలో చాకలి చన్నమల్లప్ప,సాగర్,సజ్జల భాస్కర్,హేమంత్,అనూషకు రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు కాపు భారతి,ప్రముకుల సమక్షంలో దుస్సాలువాలో సర్కరించి మెమొంటోను ప్రదానం చేశారు రక్తదాన కార్యక్రమంలో పనిచేసిన మమ్మల్ని గుర్తించి మమ్మల్ని సత్కరించినందులు సంతోషం వ్యక్తంచేశారు మరిన్ని కార్యక్రమాల్లో పాల్గోని ప్రజాసేవ చేస్తామని అన్నారు

## మాజి సర్పంచ్ మల్లికార్జునను పరామర్శించిన ఉన్న మారుతి

**బ్రహ్మసముద్రం జూన్ 14 ప్రభాతవార్త, :** మండలంలోని కన్నేపల్లి మాజి సర్పంచ్ మల్లికార్జున గతకొనినరోజులుగా అనారోగ్యంలో హస్పెటల్‌లో చికిత్స పొందుతూ ఇంటికి తిరిగివచ్చిన మాజిసర్పంచ్ మల్లికార్జునను భుధవారం తెదేపా యువనాయకుడు ఉన్నం మారుతీచౌదరి మల్లికార్జునను పరామర్శించి తన అరోగ్యస్థితిని అడిగి తెలుసుకొన్నారు.ఈ అనంతరం మండలంలోని బుడిమేపల్లి గ్రామానికి చెందిన చాకలి భీమప్ప మృతిచెందిన విషయంతెలుసుకొన్న మారుతిచౌదరి భీమప్ప కుటుంబాన్ని పరామర్శించారు ఈ కార్యక్రమంలో మాజి ఎంపిపి రాయల్ శ్రీనివాసులు,మాజికన్వీనర్ రాజశేఖర్‌గౌడ్, మాజి సర్పంచ్ తిమ్మప్పచౌదరి,సుబాన్, దొనతిమ్మప్ప,చిత్తప్ప దతితరులు పాల్గోన్నారు

## వివాహ నిశ్చితార్థానికి హాజరైన టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు


నిశ్చితార్థ వేడుకల్లో నూతన వధువరులతో టీడీపీ నేతలు

**కళ్యాణదుర్గం టౌన్, జూన్ 14 ప్రభాతవార్త :** అనంతపురం జిల్లా కేంద్రంలో అలెగ్జాండర్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి గుద్దిళ్ల హరి ఆహ్వానం మేరకు వారి అన్న రాజు వెడ్స్ అన్యశ్రీ వివాహ నిశ్చితార్థానికి హాజరై టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు ఉన్నం హనుమంతరాయ చౌదరి, కుటుంబ సభ్యులు, మాజీ శాసనసభ్యులు బ్రాకర్‌చౌదరి, టీడీపీ సీనియర్ నాయకులు మోరేపల్లి మల్లికార్జున, ఎస్‌టి చౌదరి, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కరణం రామ్మోహన్ చౌదరి, శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టు బోర్డు సభ్యులు ఆర్జి శివశంకర్, అనంతపురం పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షులు వైపి రమేష్, రాష్ట్రరైతు సంఘం కార్యదర్శి లక్ష్మినారాయణ, రాష్ట్ర మాజీ లీడ్ క్యాప్ డైరెక్టర్ ఆవుల తిప్పేస్వామి, మాజీ మండల కన్వీనర్ దండా వెంకటేషులు, మాజీ సర్పంచు గాజుల శ్రీరాములు, క్లస్టర్ ఇన్‌చార్జ్ అనంతపురం నాగరాజు, మాజీ వైస్ ఎంపిపి తలారి ఎరిస్వామి, పాపంపల్లి గ్రామ కమిటీ అధ్యక్షులు కొల్లకుంట ఆంజినేయులు, పాల్గొన్నారు.

## రాయలసీమలో యువగళం పాదయాత్ర ముగింపు సందర్భంగా వీడ్కోలు


నారాలోకేష్‌కు వీడ్కోలు పలుకుతున్న రాయలసీమ టీడీపీ నాయకులు, కార్యకర్తలు

**కళ్యాణదుర్గం టౌన్, జూన్ 14 ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో భాగంగా కడప జిల్లా, బద్వేలు నియోజకవర్గంలో రాయలసీమలో పాద యాత్ర ముగింపు సందర్భంగా కళ్యాణదుర్గం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ మాదినేని ఉమామహేశ్వరనాయుడు, రాయలసీమ నాయకులు, కార్యకర్తలు వీడ్కోలు పలికారు.

## బైరవానితిప్ప సచివాలయంవద్ద ప్రజలు అధికారుల కోసం ఎదురుచూపు



సచివాలయం దగ్గరకూర్చొన్న ప్రజలు

**బ్రహ్మసముద్రం జూన్ 14 ప్రభాతవార్త, :** మండలంలోని భైరవానితిప్ప సచివాలయంలో అధికారుల పనితీరుపై ప్రజలు అగ్రహం వ్యక్తం చేశారు.బుధవారం ప్రజలు అవసరాలకు సచివాలయంకు వెళ్ళగా చివాలయం 11 గంటలైనా తెరవకపోవడంపై ప్రజలు సచివాలయంవద్ద నిరసన వ్యక్తం చేశారు.ప్రతిరోజు అధికారులు సమయపాలన పాటించకుండా ఇష్టమెచ్చినప్పుడు వచ్చివెళ్తున్నారని ప్రజలు వాపోతున్నారు ఇప్పటికైనా ఉన్నతాదికారులు స్పందించి సచివాలయ ఉద్యోగులు సక్రమంగా సచివాలయంకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు

## ఈ నెల16న నిర్వహించే జలజీవన్ మిషన్ కార్యక్రమంకు హాజరుకండి -ఎంపిడీఓ

**బ్రహ్మసముద్రం జూన్ 14 ప్రభాతవార్త, :** ఈ నెల16న నిర్వహించే జలజీవన్ మిషన్ కార్యక్రమంకు హాజరుకండి -ఎంపిడీఓ దాసానాయక్ పత్రికా ముకంగా తెలిపారు.మండలంలోని ఎంపిడీఓ కార్యాలయంలో శుక్రవారం 16 తేదీన జల్‌జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో తాగునీటి సమస్యలు తీర్చే కార్యక్రమంకు ప్రణాలిక కార్యక్రమంద్వారా నిర్వహించు జల్‌జీవన్ మిషన్ కార్యక్రం అవగాహన కార్యక్రమంకు సర్పంచ్‌లు,ప ంచాయితీ కార్యదర్సులు హాజరుకావాలని వచ్చేటప్పుడు అధార్‌కార్డు జిరాక్స్,2 పాస్‌ఫోటోలు,పాన్‌కార్డు జిరాక్స్,రబ్బరుస్టాంపు సీల్,తీసుకొని శుక్రవారం 11 గంటలకు హాజరుకావాలని తెలిపారు

## ప్రతిభ చూపిన విద్యార్థికి నగదు బహుమతి


విద్యార్థినికి నగదు అందచేస్తున్న దృశ్యం

**లేపాక్షి, జూన్ 14 ప్రభాతవార్త :** మండలంలోని చోళసముద్రం గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఈ ఏడాది 10వ తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపి పాఠశాలలో మొదటి స్థానం సాధించిన హర్షిణి అనే విద్యార్థికి బుధవారం వైసిపి మండల కన్వీనర్ నారాయణస్వామి 10వేలరూపాయల నగదు బహుమతిని అందించి అభినందించారు. ఇకపై ప్రతి సంవత్సరం పాఠశాలలో మొదటి స్థానం వచ్చిన విద్యార్థికి 10 వేల రూపాయల నగదు బహుమతి అందచేస్తామని ఆయన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి బాణాల శ్రీనివాసరెడ్డి, ఎన్‌ఆర్‌ఐ కేశవమూర్తి, మోహన్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థి తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

## ఘనంగా ఎత్నిక్ డే వేడుకలు


విద్యార్థులతో కళాశాల బృందం

**హిందూపురం, జూన్ 14 ప్రభాత వార్త :** పట్టణం లోని ఎస్‌డిజిఎస్ కళాశాలలో బుధవారం ఎత్నిక్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాలలోని ఎంబిఏ, బిబిఏ విద్యార్థినిలు వివిధ సంస్కృతి, సాంప్రదాయ సమ్మేళనం నిర్వహించారు. తెలుగుదనం ఉట్టిపడేలా సంక్రాంతి, బతుకమ్మ పండుగలు, కేరళ సాంప్రదాయం ప్రతిబింబించే విధంగా ఓనం పండుగ, మహారాష్ట్ర మారతాసాంస్కృతి కనువిందు చేసే విధంగా గుడిపడ్వా ఉట్టి కొట్టడం, భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాలు అన్ని కలగలిపి విద్యార్థినిలు ఈ వేడుకలు నిర్వహించారు. అనంతరం వివిధ నాట్యాలతో విద్యార్థులు అలరించారు. ఈ సందర్భంగా కళాశాల కమిటీ సభ్యులు మాట్లాడుతూ బిన్నత్వంలో ఏకత్వం అన్న మన దేశ విశిష్టతను విద్యార్థులకు తెలియచేసే విధంగా వివిధ మతాల సంస్కృతుల ఆచారాలు, ఐక్యత తెలియచేసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ కార్య క్రమంలో కళాశాల కార్యదర్శి బైసాని రాంప్రసాద్, కళాశాల ఎంబిఏ ప్రిన్సిపాల్ నాగేంద్రకుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, హెచ్ఓడి అనిల్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాగి పంట సాగుపై అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

**హిందూపురం టౌన్, జూన్ 14 ప్రభాతవార్త :** రాగి పంట సాగుపై బుధవారం హిందూపురం రూరల్ కిరికెర రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయాధికారుల అవగాహన కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ కార్య క్రమానికి పెనుకొండ సబ్‌కలెక్టర్ కార్తీక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో తక్కువ కాలంతో ఎక్కువ దిగుబడి ఇచ్చే ఇంద్రావతి రకం రాగి విత్తనం 4 కిలోల ప్యాకెట్ 50 శాతం రాయితీతో 139 రూపాయలకే ప్రభుత్వం రైతులకు అందచేస్తుందని అదేవిధంగా దిగుబడిని ప్రభుత్వమే క్వింటాలుకు 3864 రూపాయల మద్దతు ధరతో కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాగి పంట సాగుకు ముందుకు రావాలని కోరారు. సులభతరమైన పంటలతో రైతులకు మరింత మేలు చేకూరుతుందని అధికారులు సూచించారు. ఈ కార్య క్రమంలో ఎడిఎ అల్తాఫ్‌అలీఖాన్, తహశీల్దార్ హసీనాసుల్తానా, ఎంపిడిఓ నరేంద్ర, ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఆర్టీసి ఉద్యోగులు ఎర్రబ్యాడ్జీలతో విధులకు హాజరు


నినాదాలు చేస్తున్న ఆర్టీసి ఉద్యోగులు

**హిందూపురం, జూన్ 14 ప్రభాతవార్త :** హిందూపురం డిపోలో విధులు నిర్వహిస్తున్న ఆర్టీసి ఉద్యోగులు తమ డిమాండ్ల పరిష్కారం కోసం బుధవారం ఎర్రబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ హిందూపురం డిపోలో చాలా కాలంగా డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై పుట్టపర్తి డిపిటిఓకు పలుమార్లు వినతిపత్రాలు అందచేసినప్పటికి సమస్య పరిష్కరించలేదని, ఉద్యోగులపై అక్రమ సస్పెన్షన్లు రద్దు చేయాలని, అదేవిధంగా గ్యారేజీలో మెకానిక్‌లకు పనిభారం తగ్గించాలని, పెండింగ్‌లో వున్న పిఆర్‌సి విడుదల చేయాలని వివిధ డిమాండ్లతో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ డిపో కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు.

## ఫిట్‌నెస్ లేని బస్సులను నడపరాదు


ఆర్టీఓకు వినతిపత్రం అందచేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

**హిందూపురం టౌన్, జూన్ 14 ప్రభాతవార్త :** ప్రవేటు, కార్పొరేట్ పాఠశాలలకు సంబంధించి ఫిట్‌నెస్ లేని బస్సులను నడపరాదంటూ అటువంటి వాటికి బాధ్యులైన సంబంధిత పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని బుధవారం రవాణాశాఖాధికారి కరుణసాగర్‌రెడ్డికి ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బాబావలి, తదితరులు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా బాబావలి మాట్లాడుతూ వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తూ కండీషన్ లేని బస్సుల్లో విద్యార్థులను తరలిస్తూ వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. పరిమితికి మించి బస్సుల్లో విద్యార్థులను తరలిస్తున్నారని ఇటువంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు జయచంద్ర, తరుణ్, హర్షకుమార్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## రెండు నగదు చోరీల కేసుల్లో నలుగురు నింధితులు అరెస్టు


నింధితులను చూపుతున్న పోలీసులు

**కళ్యాణదుర్గం టౌన్, జూన్ 14 ప్రభాతవార్త :** కళ్యాణదుర్గంలో 10 రోజుల క్రితం జరిగిన రెండు నగదు చోరీలలో నలుగురు నింధితులను అరెస్టు చేసినట్లు కళ్యాణదుర్గం పోలీసులు తెలియజేశారు. వారి వద్ద నుంచి 3.45 లక్షల రూపాయలు నగదు, మూడు ద్విచక్ర వాహనాలు రికవరీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం కేసు పూర్వపరాలను మీడియాకు వెల్లడించారు. జూన్ 1వ తేది, 9వ తేది ఇరువురు వ్యక్తులు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, యూనియన్ బ్యాంకుల నుంచి తమ అకౌంట్‌లో ఉన్న 3.45 లక్షల రూపాయలు నగదు డ్రా చేసుకుని తమ ద్విచక్ర వాహనాల సైడ్ కవర్‌లో పెట్టుకుని వెళ్తుండగా వారి దృష్టి మళ్లించిన సదరు నగదు బ్యాగులను దొంగిలించడం జరిగింది. బాధితులు జి.రవికుమార్, చాకలి శంకర్‌లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్రైం నెంబర్ 89/2023, 92/2023, యు/సెక్షన్ 379 ఐపిసి కింద కళ్యాణదుర్గం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసులను నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. 10 రోజుల వ్యవధిలోనే రెండు దొంగతనాలు జరగడం సీరియస్గఆ తీసుకున్ని జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, కళ్యాణదుర్గం డిఎస్పీ బి.శ్రీనివాసులు ఈ రెండు కేసులను త్వరలో ఛేదించాలని ఆదేశాలు జారీ చేశారు. కళ్యాణదుర్గం సిఐ తేజోమూర్తి ఆధ్వర్యంలో బృందం సభ్యులు రాబడిన సమాచారం మేరకు బుధవారం ఉదయం 10 గంటల సమయంలో కళ్యాణదుర్గం శివార్లలోనిమారుతీ వే బ్రిడ్జి వద్ద తెలిపిన నలుగురు అంతరాష్ట్ర ముఠా సభ్యులు కుచంల సుబ్రహ్మణ్యం, పసుపులేటి వినోద్, గోగుల తులసేందర్, పసుపులేటి రమేష్‌లను అరెస్టు చేశారు.

## కాలం చెల్లిన ఆర్టిసి బస్సులు.. ఇబ్బందుల్లో ప్రయాణికులు

**బొమ్మనహాళ్, జూన్ 14 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోగల కొండ క్యాంపులో బుధవారం సాయంత్రం 5 గంటలకు ఉరవకొండ డిపోకు చెందిన ఆర్టిసి బస్సు సాంకేతిక లోపం వల్ల ఆగిపోయిందని, సిబ్బంది తెలిపారు. డ్రైవర్ పలు మార్లు ప్రయత్నించినా బస్సు రోడ్డు ఎక్కలేదని ప్రయాణికులందరూ కిందకు దిగి కొంత మంది ద్విచక్ర వాహనాల్లో కొంత మంది ఆటోల సహాయంతో బళ్లారికి వెళ్లినట్లు, మరికొంత మంది మరో ఆర్టిసి బస్సు ఎక్కి వెళ్లినట్లు సమాచారం. బస్సులో సుమారు 50 మందికిపైగా ప్రయాణికులు ఉన్నారని, వీరంతా కణేకల్లులో జరిగిన ఊరి దేవరతోపాటు పలు వివాహాల వేడుకలకు హాజరై తిరిగి బళ్లారికి వెళ్తున్నట్లుప్రయాణికులు తె లిపారు. గతంలో కణేకల్లు నుంచి బళ్లారికి 35 రూపాయలు టికెట్టు చార్జీ ఉండగా అదే కిలోమీటర్లకు ఆర్టిసి వారు ప్రస్తుతం 55 రూపాయలు చేశారని, సుమారు 20 రూపాయలు పెంచి ప్రయాణికులకు భారమైందని అయినా ఈ కాలం చెల్లిన బస్సులే దిక్కయ్యాయని, ఆర్టిసి వారిపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాత బస్సులకే కొత్త కలర్లు వేసి కొత్త చార్జీలు వసూలు చేయడం ఎంతవరకు సబబని అన్నారు. ఇకనైనా ఖండిషన్‌లో ఉన్న బస్సులు నడిపి ప్రయాణికులను సమయానికి గమ్య స్థానానికి చేరేలా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## పొగాకు నియంత్రణ పై అవగాహన కార్యక్రమం


అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**కంబదూరు, జూన్ 14, ప్రభాతవార్త:** జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా బుధవారం కంబదూరు మండల కేంద్రంలోని పాత ఆర్డీటి కాలనీలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది,స్థానిక నాయకులు ఆధ్వర్యంలో సిగరెట్ మరియు పొగాకు ఉత్పత్తుల చట్టం 2003 గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఒటిపిఓ-2003 చట్టం ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తే 200 రూపాయలు జరిమానా విధించబడుతుందని పేర్కొన్నారు.సిగరెట్,బీడి,గుట్కా,పాన్ మసాలా,ఖైనీ వాడటం వలన ప్రాణాంతకరమైన క్యాన్సర్ గుండె సంబంధిత వ్యాధులు సంభవిస్తయన్నారు.ఈ వ్యాధుల భారిన పడకుండా ఉండాలంటే పొగాకు నియంత్రణ ఒక్కటే మార్గం అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పద్మావతమ్మ,ఎంపీపీ గోవిందు,సచివాలయ కన్వీనర్లు గంగాధర,మీ సేవ కుమార్,ఎంపీటిసి మల్లేష్,చెన్నకేశవులు,వైద్యాధికారి ఆసియా,సిహెచ్‌ఓ సత్యవతి,ఎంపిహెచ్ ఈఓ నజీర్,పంచాయితీ సెక్రటరీ రాఘవేంద్ర, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు,అంగన్ వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధుడు అదృశ్యం


హనుమంతప్ప ఫైల్‌ఫోటో

**హిందూపురం టౌన్, జూన్ 14 ప్రభాతవార్త :** హిందూపురం పట్టణం మేళాపురంకు చెందిన హనుమంతప్ప అనే వృద్ధుడు సోమవారం రాత్రి నుండి అదృశ్యమైనట్లు హనుమంతప్ప కుమారుడు రామకృష్ణ తెలిపారు. హిందూపురం పరిసర ప్రాంతాల్లో వెతికినప ్పటికి ఆచూకి లభించలేదన్నారు. ఆచూకి తెలిసిన వారు 9908052304, 7207700620, 9491800393 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

## నాగానిపల్లిలో ఘర్షణ - ఒకరు మృతి


మృతి చెందిన నరసింహప్ప (ఫైల్‌ఫోటో)


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సిఐ వేణుగోపాల్, ఎస్ఐ మునీర్‌అహ్మద్

**లేపాక్షి, జూన్ 14 ప్రభాతవార్త :** మండలంలోని నాగానపల్లిలో రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో చిన్న నరసింహప్ప (72) మృతి చెందినట్లు ఎస్ఐ మునీర్‌అహ్మద్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మృతుని అల్లుని వరుసైన అదే గ్రామానికి చెందిన గోవిందప్ప అనే వ్యక్తి కర్నాటక ఐడిహళ్లి గ్రామ సమీపంలోని కమటాలపల్లికి చెందిన సజ్జక్కతో 8 సంవత్సరాల క్రితం వివాహమైంది. వారికి ఒక కుమారుడు, కుమార్తె వున్నారు. అయితే కొన్ని రోజుల క్రితం సజక్క తన పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. ఇది ఇలా వుండగా సజ్జక్క పెద్దమ్మ లక్ష్మమ్మ, పెద్దనాన్న చిన్ననరసింహప్పలు నాగానిపల్లి గ్రామంలో నివాసం వుంటున్నారు. వారం రోజుల క్రితం లక్ష్మమ్మ, చిన్న నరసింహప్పలు సజ్జక్క స్వగ్రామమైన కమటాంపల్లికి వెళ్లి వచ్చారు. ఈ నేపథ్యంలో సజ్జక్క నాగానిపల్లికి వచ్చి తన భర్త ఇంటిలో వున్న బంగారు నగలు తదితర వస్తువులను భర్త ఎదుటే తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఇంత తతంగం జరుగుతున్నా భర్త గోవిందప్ప మాత్రం భార్యను ఒక మాట కూడా మాట్లాడలేదన్నారు. ఈ నేపథ్యంలో గోవిందప్ప బుధవారం మద్యం సేవించి తన భార్య పుట్టింటికి వెళ్లడానికి లక్ష్మమ్మ, చిన్న నరసింహప్పలే కారణమని భావించి వారితో ఘర్షణ పడడంతో నరసింహప్ప కుటుంబసభ్యులు జయమ్మ, మనవడు లక్ష్మినారాయణలు అడ్డుకున్నారు. అయితే తీవ్రమైన కోపంతో వున్న గోవిందప్ప కర్రతో చిన్న నరసింహప్ప తలపై గట్టిగా బాదడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న హిందూపురం రూరల్ సిఐ వేణుగోపాల్, ఎస్ఐ మునీర్‌అహ్మద్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. హత్యకు కారణమైన గోవిందప్ప పరారీలో వున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ముగిసిన క్రికెట్ టోర్నమెంట్


బహుమతులను అందజేస్తున్న దృశ్యాలు

**శెట్టూరు, జూన్ 14 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కైరేవు గ్రామంలో గత నెల రోజుల నుంచి మాజీ సర్పంచు గొర్ల ఇటికనాలప్ప జ్ఞాపకార్థంతో క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేయడం జరిగింది. విన్నర్‌గా కళ్యాణదుర్గం క్రికెట్ జట్టు. రన్నర్‌గా కైరేవు జట్టు నిలిచారు. ఈ సందర్భంగా వారికి బహుమతులు అందజేసిన సింగిల్ విండో డైరెక్టర్ గొర్ల గంగాధర్. కంబదూరు మండలం వైస్ ఎంపిపి రాళ్ల అనంతపురం భీమేష్, చేతుల మీదుగా, అందజేయడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ.. మాజీ సర్పంచు గొర్ల ఇటకనాలప్ప జ్ఞాపకార్థంతో ఏర్పాటు ఏసిన ఈ క్రికెట్ టోర్నమెంట్ చాలా సంతోషంగా ఉందని, యువకులు ఈ క్రీడల పట్ల శరీరక ఉల్లాసాన్ని అవలంబించగలరని ముందు ముందు ఇలానే ఈ క్రికెట్ టోర్నమెంట్‌లను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమంతరాయుడు, నరసింహా, బాదెప్ప, క్రికెట్ మేనేజ్‌మెంట్, సతీష్, వెంకీ, మహేష్, గురు, గ్రామ పెద్దల యువత పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయడం జరిగింది.

## షెడ్యూల్ ప్రకారం మంచినీటిని విడుదలకు చర్యలు చేపట్టాలి... - టిడిపి శ్రేణులు


మున్సిపల్ కమీషనర్ మల్లికార్జునకు వినతిపత్రంను అందచేస్తున్న టిడిపి కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు.

**గుంతకల్లు, జూన్ 14 ప్రభాత వార్త :** పట్టణం లోని 37వార్డులకు సంబంధించి ఆయా ప్రాంతాల నివాసిత ప్రజల పట్ల ఆరోగ్య రక్షణకు ప్రథమ ప్రాధాన్యత కల్పిస్తూ నిర్ణీత షెడ్యూల్ ప్రకారం కొళాయిల ద్వారా మంచినీటి విడుదలకు చర్యలను చేపట్టాలని టిడిపి శ్రేణులు డిమాండ్ చేశారు. బుధవారం గుంతకల్లు పురపాలక సంఘం కార్యాలయంలో మున్సిపల్ కమీషనర్ మల్లికార్జునకు టిడిపి పట్టణ శ్రేణులు వినతిపత్ర ంను అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ ఆర్.జితేంద్రగౌడ్ ఆదేశాలతో తాము మున్సిపల్ కమీషనర్‌ను కలిసామన్నారు. పట్టణంలోని 37వార్డులలో ప్రజలకు ప్రధాన సమస్యగా త్రాగునీటి సరఫరాలో ఇటీవల కలుషిత నీరు పంపిణీ కావడం దురదృష్టకరమన్నారు. ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా ప్రజల ఆరోగ్య రక్షణ పట్ల ప్రథమ ప్రాధాన్యత కల్పించాలన్నారు. కలుషిత నీరు పంపిణీతో ప్రజలు అనారోగ్యంకు గురికాకుండా శుద్ధత గల మంచినీటిని షెడ్యూల్ ప్రకారం కొళాయిల ద్వారా త్రాగునీటి విడుదలకు చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో ప్రజల సమీకరణతో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్‌ఛైర్మెన్ ఆర్.శ్రీనాథ్‌గౌడ్,టిడిపి కౌన్సిలర్లు ఆర్.పవన్‌కుమార్‌గౌడ్, కృపాకర్,మహమ్మద్‌షరీఫ్,అనురాధ,అరుణలతో పాటు పార్టీ పట్టణ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా " ప్రపంచ రక్తధాతల దినోత్సవం "

- రక్తదానంతో 50మంది మానవత్వంను చాటుకున్న తీరు...
- రక్తదానం చేసిన మున్సిపల్ కమీషనర్ మల్లికార్జున


వేడుకల సభలో ప్రసంగిస్తున్న మున్సిపల్ కమీషనర్ మల్లికార్జున తదితరులు.


రక్తదానం చేస్తున్న మున్సిపల్ కమీషనర్ మల్లికార్జున.

**గుంతకల్లు, జూన్ 14 ప్రభాతవార్త :** పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో బుధవారం జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగరాజు, రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్, చిట్టిబాబుల ఆధ్వర్యంలో " ప్రపంచ రక్తధాతల దినోత్సవం " వేడుకలను ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సదరు కార్యక్రమంకు ముఖ్య అతిథులుగా మున్సిపల్ కమీషనర్ వి.మల్లికార్జునతో పాటు ఆసుపత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత, డాక్టర్ వంశీకృష్ణలు, శ్రీసాయి మహిళా డిగ్రీ కళాశాల, వివేకానంద ఎంసిఎ కళాశాలల యాజమాన్యం, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ప్రతి మనిషి ఒక రక్తనిధి కేంద్రమని, ప్రతి మనసు ఒక మానవత్వంతో కూడిన రక్తనిధి కేంద్రంగా మారి ప్రాణాపాయస్థితిలోని క్షతగాత్రులైన వారికి అవసరమైన రక్తధానం చేసి వారి వారి ధాతృత్వంకు ప్రతీకగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈక్రమంలో రక్తదాన శిబిరం ఏర్పాటులో భాగంగా దాదాపు 40మంది రక్తదానం చేయగా అందులో మున్సిపల్ కమీషనర్ కూడా రక్తదానం చేసి తనదైనశైలిలో న ధాతృత్వంను చాటుకున్నారు. తదుపరి వారికి రక్తదాన ధాతలుగా ప్రశంసాపత్రాలను వారు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో న్యాయవాది కోరి చంద్రశేఖర్,అధ్యాపకులు డా,భాష,గురులతో పాటు స్వచ్ఛంద సేవా ప్రతినిధులు రమేష్, నాగరాజు,నాగేంద్ర,దివ్యభారతి ల్యాబ్ టెక్నీషియన్లు సత్య,ఉమా తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన మారెమ్మ దేవత విగ్రహప్రతిష్ట వేడుకలు



**బత్తలపల్లి, జూన్ 14 ప్రభాతవార్త :** మండలంలోని గంటాపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన ఆలయంలో మారెమ్మ దేవత విగ్రహ ప్రతిష్ట వేడుకలు ఘణంగా ముగిసాయి. బుధవారం ఉదయం వేదపండితులు మారెమ్మదేవి విగ్రహ ప్రతిష్ట, యంత్రస్థాపన, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి, అమ్మవారి దర్శనం కల్పించారు. అన్నధానం చేపట్టారు గత మూడు రోజులుగా నిర్వహించిన వేడుకలు విగ్రహ ప్రతిష్టతో ముగిసాయి. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## పెన్నహోబిళంలో 2వ రోజు కొనసాగిన భూముల వేలం

-నేడు చిన్నముష్టూరు, పెద్దముష్టూరు గ్రామాల్లోని భూముల వేలాలు


వేలంలో నిర్వహిస్తున్న దృశ్యం


వేలంలో పాల్గొన్నవారు

**ఉరవకొండ, జూన్ 14 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళం శ్రీ లక్ష్మినరసింహస్వామి ఆలయంలో బుధవారం 2వ రోజు స్వామివారికి చెందిన మోపిడి గ్రామంలోగల 417.06 ఎకరాల భూమికి వేలం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో తాడిపత్రి గ్రూప్ టెంపుల్స్ ఈఓ యం.సుబ్రమణ్యం పర్యవేక్షణలో జరిగిన వేలంలో గ్రామానికి చెందిన 32 మంది డిపాజిట్లు కట్టి వేలంలో పాల్గొనగా 46.73 ఎకరాలకుగాను ఆలయానికి మునుపటికంటే 12,450 రూపాయలు ఆదాయం పెరిగిందని ఆలయ ఈఓ కె.విజయ్‌కుమార్ తెలిపారు. 15వ తేదీ గురువారం పెద్దముష్టూరు, చిన్నముష్టూరు గ్రామాల్లోని శ్రీవారి ఆలయానికి చెందిన భూములను వేలం నిర్వహించడం జరుగుతుందన్నారు.

## మండల సర్వేయర్‌గా మారుతి

**అగళి, జూన్ 14 ప్రభాతవార్త :** అగళి మండల మండల సర్వేయర్‌గా మారుతి పదవీ బాధ్యతలు చేపట్టారు. వీరి పదోన్నతిపై అగళి మండలానికి వచ్చినట్లు తెలిపారు. వీరు గతంలో కుందుర్పిలో పనిచేస్తూ అగళి మండలానికి బయల్దేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మారుతి మాట్లాడుతూ.. ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

# చంద్రబాబు పచ్చి అపద్దాల కోరు

## - పేదల జీవితాల్లో వెలుగు నింపుతున్న సీఎం వైఎస్ జగన్ - గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే

కదిరి, జూన్ 14 ప్రభాతవార్త

రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధిని సమంగా ముందుకు తీసుకెళ్తున్న వైకాపా ప్రభుత్వంపై అనవసరమైన ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుతున్న మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పచ్చి అపద్దాల కోరని ఎమ్మెల్యే డా.పివి.సిద్ధారెడ్డి ఆరోపించారు. బుధవారం గాండ్లపెంట మండల పరిధిలోని జురుకువారిపల్లి, కటారుపల్లి క్రాస్, మాలపల్లి, సాగులవాండ్లపల్లి, గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డా.పివి.సిద్ధారెడ్డి పాల్గొని ప్రజల సమస్యలు అడిగి, అనంతరం ప్రభుత్వం ముద్రించిన సంక్షేమ కరపత్రికలను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రజలు ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకురావడంతో స్పందించి సమస్యలుపరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ.. గత సార్వత్రిక ఎన్నికల్లో ఏవైతే హామీలు ఇచ్చామో ఆ హామీలన్నింటినీ తూచా తప్పకుండా నెరవేరుస్తున్నామన్నారు. అవ్వాతాతలకు అండగా, అక్క చెల్లెమ్మలకు అండగా నిలబడి పేదల జీవితాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపుతున్నారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా గ్రామ/ వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి వాలె ంటీర్ల ద్వారా ప్రజల వద్దకే నేరుగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. ఎక్కడ కూడా వివక్షతకు తావు లేకుండా కులమతాలు, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. జీర్ణించు కోలేని చంద్రబాబు అడుగడుగునా అభివృద్ధిని అడ్డుకోవడానికి అద్భుత గులుతూ బురద జల్లే కార్యక్రమాలు చేస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని హితవు పలికారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ అధికారం వైకాపా పార్టీదేనని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, వైఎస్ఆర్‌సిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వృద్దురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డా.పివి.సిద్ధారెడ్డి

# ప్రజల సంక్షేమమే జగనన్న ధ్యేయం - ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

యల్లనూరు, జూన్ 14 ప్రభాతవార్త

ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న ధ్యేయమని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. మండలంలోని వెన్నపూసపల్లి గ్రామంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్య క్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ఇంటింటికి వెళ్లి ప్రతి ఒక్కరిని పలకరించారు. ముందుగా మార్కెట్‌యార్డ్‌మా జీచైర్మన్ భోగాతి నారాయణరెడ్డి ఎమ్మెల్యేకు పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే గడపగడపకు తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజలకు వివరించారు. వృద్ధులు, మహిళలు, పిల్లలను ఆప్యాయంగా పథకాలు అందుతున్నాయా అంటూ పలుకరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ సంక్షేమ పథకాలు అర్హులందరికి చేరడంతో ఏ గడపతొక్కినా ప్రజల ఆదరణ అపూ ర్వంగా వుందని కొనియాడారు. పార్టీలు, కులమతాలకు అతీ తంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుం దన్నారు. కావునా మనందరి జీవి తాలు, మన పిల్లల భవిష్యత్తు బాగుండా లంటే మనందరం 2024లో జగనన్నకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్య క్రమంలో తహశీల్దార్ సుమతి, ఎంపిడిఒ వీ ర్రాజు, జెడ్‌పిటిసి భోగాతి ప్రతాప్‌రెడ్డి, హౌసింగ్ ఎఇ సుప్రజ, ట్రాన్స్ కో ఎఇ పద్మనాభరెడ్డి, వైకాపా నాయకులు హరిచంద్రారెడ్డి, మహే శ్వర్‌రెడ్డి, పెద్దిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, సంజన్న, జాఫర్, ఓబులేసు, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

# చెత్త విత్తన వేరుశనగ మాకు వద్దు..

## - సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు మహిళా రైతుల ఆందోళన - విత్తన వేరుశనగ పంపిణీ ఆపిన అధికారులు - రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తా.. మహిళా రైతు

పెనుకొండ, జూన్ 14 ప్రభాతవార్త

రైతులకు నాణ్యమైన రాయితీ విత్తన వేరుశనగను పంపిణీ చేయడంలో ప్రభుత్వం వైఫల్యం చెంది ంది. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో విత్తన సేకరణ ఏజెన్సీలు ఊజీ, పుల్లలు, నాసులు, రాళ్లు, బొటికెలు కలిగిన నాసిరకం విత్తనకా యలను రైతులకు అంటగడుతున్నాయి. నాసిరకం విత్తన కాయల పంపిణీపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం సోమందేపల్లి మండలం కేతగాని చెరువు గ్రామానికి చెందిన లక్ష్మమ్మ అనే మహిళా రైతు నాసిరకం విత్తన కాయలను పెనుకొండ సబ్ క లెక్టర్ కార్యాలయం ముందు పారబోసి వినూత్నంగా ఆందోళన చేపట్టారు. ఇలాంటి చెత్త విత్తన వేరుశెనగ కాయలను రైతులకు అంటగట్టి దగా చేస్తున్నారంటూ ధ్వజమెత్తారు. మం డలంలో అధికారుల వద్దకు వెళితే అందుబాటులో లేరని తమకు న్యాయం జరిగేందుకు సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టా నన్నారు. అధికారులు వచ్చి రైతులకు న్యాయం చేసే వరకు ఇక్కడి నుంచి కదిలే ప్రసక్తే లేదంటూ ఆమె అన్నారు. వడ్డీలకు తెచ్చి విత్తన వేరుశనగ కాయలను కొన్నామని ఇలాంటి నాసిరకం విత్తనాలను అంటగట్టి రైతులను నిండా ముంచుతున్నారని తీవ్రస్థాయిలో ఆమె విమర్శించారు.

**విచారణ చేస్తున్నాం.. రైతులకు న్యాయం చేస్తాం.. : సబ్ కలెక్టర్ :** సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళనకు దిగిన మహిళ రైతు విషయం తెలుసుకున్న సబ్ కలెక్టర్ కార్తిక్ హుటాహుటిన కార్యాలయానికి చేరుకుని మహిళ రైతు లక్ష్మమ్మతో మాట్లాడారు. నాసిరకం విత్తన పంపిణీపై ఫిర్యాదులు వచ్చాయని వ్యవసాయ శాఖ అధికారులు విచారణ చేస్తున్నారని రైతులకు న్యాయం చేస్తామని సబ్ కలెక్టర్ కార్తిక్ ఆమెకు వివరించారు. రైతులకు విత్తన వేరుశనగ పంపిణీ చేసిన ఏజెన్సీ నిర్వహకులను ఇక్కడికి పిలిపించండి అని మహిళా రైతు పట్టుపట్టింది. రెండు మూడు రోజుల్లో అందరికీ న్యాయం చేస్తామని సబ్ కలెక్టర్ వివరించి చెప్పి వెళ్లిపోయారు. తనకు సరైన న్యాయం జరిగే వరకూ ఎన్ని రోజులైనా ఇక్కడే ఉంటానని ఇక్కడ నుంచి వెళ్లే ప్రసక్తి లేదని లక్ష్మమ్మ భీష్మించుకుని కూర్చున్నారు.

**విత్తన వేరుశనగ పంపిణీ ఆపాం.. నాణ్యమైన విత్తనం అందిస్తాం : ఏడి స్వయం ప్రభ :** సోమందేపల్లి మండలంలో విత్తన వేరుశనగ పంపిణీ ఆపమని నాసిరకం విత్తన కాయల బస్తాలను వెనక్కు తీసుకుని నాణ్యమైనవి అందిస్తామని మహిళా రైతు లక్ష్మమ్మకు పెనుకొండ ఏడి స్వయం ప్రభ తెలిపారు. రేపు వచ్చి రైతుల దగ్గర విచారణ చేసి అందరికీ న్యాయం చేస్తామని ఆమెకు నచ్చ చెప్పారు. అందుకు మహిళా రైతు మీరు రాతపూర్వకంగా రాసి ఇస్తే ఆందోళన విరమిస్తానని చెప్పారు. రైతులకు న్యాయం చేస్తామని నాశిరకం విత్తనాలు వెనక్కి తీసుకుని నాణ్యమైన విత్తనాలు అందిస్తామని సోమందేపల్లి వ్యవసాయ అధికారిని మహిళా రైతుకు రాసి ఇచ్చారు. దీంతో మహిళా రైతు శాంతించి ఆందోళన విరమించారు.



సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు విత్తన వేరుశనగ పారబోసిన మహిళా రైతు



సబ్ కలెక్టర్‌కు సమస్య వివరిస్తున్న మహిళ రైతు



నాసిరకం విత్తన వేరుశెనగ

# వినియోగదారులకు మెరుగైన సేవలు అందించండి

## - ఏపిఎస్‌పిడిసిఎల్ సిఎండి సంతోష్‌రావ్

హిందూపురం, జూన్ 14 ప్రభాతవార్త

విద్యుత్ వినియోగదారులకు సత్వర సమస్యల పరిష్కారం, సకాలంలో స్పందన, మెరుగైన సేవలు అందించాలని విద్యుత్ శాఖ తిరుపతి ఏపిఎస్‌పిడిసిఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంతోష్‌రావ్ పిలుపునిచ్చారు. బుధవారం పెనుకొండ సమీపంలో నిర్వహించిన హిందూపురం డివిజన్‌శాఖ విద్యుత్ ఉద్యోగుల సమీక్షా సమావేశంలో ఆయనతో పాటు సిజిఎం గురవయ్య, ఉమ్మడి అనంతపురం జిల్లా ఎస్ఇ సురేంద్ర, హిందూపురం ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ భూపతి హాజరయ్యారు. సిఎండి మాట్లాడుతూ కొత్త వ్యవసాయ కనెక్షన్ల కోసం రిజిస్ట్రేషన్ అయిన 30 రోజుల్లో పరిష్కరించాలని సూచిం చారు. నిరంతర విద్యుత్ సరఫరాకు సబ్‌స్టేషన్లు, 33 కెవి, 11 కెవి ఫీడర్ల నిర్వహణ, ట్రాన్స్ ఫార్మర్ల వైఫల్యాలను సకాలంలో గుర్తించడం, విద్యుత్ బిల్లులు సకాలంలో సేకరణ, ఫ్యూజ్‌ఆఫ్‌కాల్ కస్టమర్ ఫిర్యాదుకు సకాలంలో స్పందన, తదితర అంశాలపై దిశ నిర్దేశం చేశారు. ఈ కార్య క్రమంలో డివిజన్ పరిధిలోని 12 మండలాల ఎడిలు, ఎఇలు, జెఇలు, అకౌంట్స్ అధికారులు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న సిఎండి సంతోష్‌రావ్



హాజరైన ఇఇ, ఎడిలు, ఎఇలు

# ఫీజు ఎక్కడ కంసమామ

పెనుకొండ, జూన్ 14 ప్రభాతవార్త

టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఫీజులు ఎక్కడ కంస మామ అనే కార్యక్రమం గోడపత్రికలను బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయిజిల్లా తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు బికె.పార్థసారధి మాట్లాడుతూ.. విద్యాదీవెన, వసతి దీవెన, అమ్మఒడి పథకాల పేరుతో విద్యార్థులను నయావంచన చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని ధ్వజమెత్తారు. విద్యార్థుల తరపున పోరాడటానికి, జగన్‌ను ఇంటికి పంపడానికి టీడీపీ సిద్ధంగా ఉందన్నారు. బటన్‌ల ముఖ్యమంత్రి మళ్లీ బటన్ నొక్కడానికి సిద్ధమయ్యాడని ఆరోపించారు. జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థను, విద్యార్థుల భవిష్యత్తును సర్వనాశనం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. టీడీపీ హయాంలో విద్యార్థులకు ఇచ్చిన డైట్ చార్జెస్, కాస్మోటిక్ చార్జెస్‌లను తీసేసి వసతి దీవెన పేరుతో కొత్తగా ఇస్తున్నట్లు పేరు మార్చి ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్న విద్యార్థులకు పెరిగిన ధరలకు అనుగుణంగా చార్జస్ పెంచలేదని విమర్శించారు. జగన్ విద్యార్థుల జీవితాల ను రోడ్డున పడేశారని వాపోయారు. జగన్ తన అక్రమార్జ న కోసం విద్యా ర్థులను గంజాయికి బానిసలుగా మార్చారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ రవి శంకర్, జిల్లా కార్యనిర్వహఖ కార్యదర్శి మునిమడుగు వెంకటరాముడు, మండల తెలుగు రైతు అధ్యక్షులు పోతిరెడ్డి, శ్రీ సత్యసాయి జిల్లా టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు కురుబ జగదీష్, రాష్ట్ర కార్యదర్శి వినయ్‌బాబు, ఉపాధ్యక్షుడు మురళీ బాబు, ప్రోగ్రామింగ్ కమిటీ కోఆర్డినేటర్ వెంకటాపురం అభి, కార్యని ర్వహక కార్యదర్శి ఇర్షాద్, అధికార ప్రతినిధి హరీష్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ బాబు తారక్, పెనుకొండ నియోజకవర్గ అధ్యక్షుడు పార్థు యాదవ్, కార్యనిర్వహక కార్యదర్శి రాణా ప్రతాప్ ధర్మవరం నియోజకవర్గం అధ్యక్షుడు వినోద్, లేపాక్షి మండల అధ్యక్షులు దావూద్ బాషా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బికె.పార్థసారధి



గోడపత్రికలను విడుదల చేస్తున్న దృశ్యం

# జగనన్నకు చెబుదాం వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ , జాయింట్ కలెక్టర్

**మొదటి పేజి తరువాయి...** వీడాలని నిర్ణీత కాల వ్యవధిలోగా నాణ్యమైన పరిష్కారం చూపాలని ఫిర్యాదులు బియాండ్ ఎస్ఎల్ఏ పరిధిలోకి వెళ్లకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. బాధితుల సమస్యలు పరిష్కరించలేకపోతే ఎందువల్ల పరిష్కరించలేక పోయామో అర్జీదారునికి స్పష్టంగా తెలపాలన్నారు. జగనన్నకు చెబుదాం ఫిర్యాదులపై ఆయా శాఖల అధికారులు రోజువారి పరిష్కారపు నివేదికను తమకు సమర్పించాలని అలాగే కనీసం 5 మంది ఫిర్యాదుదారులతో వ్యక్తిగతంగా ఫోన్ ద్వారా సంప్రదించి సమస్యను పరిష్కరించాలని తెలిపారు. వైఎస్ఆర్ హెల్త్ క్లీనిక్, డిజిటల్ లైబ్రరీ పనులను సత్వరము పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో జరుగుతున్న కార్యక్రమాలు వంద శాతం పూర్తి చేసి జిల్లాకు మంచి పేరు తీసుకరావాలన్నారు. జగనన్న హౌసింగ్ కాలనీ నిర్మానం పనుల్లో పురోగతి సాధించాలని అలాగే ప్రయారిటీ బిల్డింగ్ పనుల ప్రక్రియను వేగవంతం చేసి లక్ష్యాన్ని అధిగమించాలన్నారు. రీ సర్వే పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరైన పనులన్నింటిని త్వరగా ప్రారంభించాలని, గతంలో ప్రారంభించిన వాటిని పూర్తి చేసి సంబంధిత బిల్లులను అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. 388 పూర్తి అయిన పనులకు గాను 239 పనులకు మాత్రమే బిల్లులు అప్‌లోడ్ చేయడం జరిగిందని, మిగిలిన 149 పనులకు సంబంధించి మున్సిపల్ కమీషనర్లు, ఎంపిడిఒలు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖలు వెం టనే బిల్లులు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఇరిగేషన్ శాఖ అధికారులు గైర్హాజర్ పట్ల కలెక్టర్ అసహనంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమైన సమావేశాలకు అధికారులందరూ తప్పకుండా హాజరు కావాలని, తన అనుమతి లేనిదే జిల్లా కేంద్రాన్ని వది లి వెళ్లరాదని స్పష్టం చేశారు. వ్యవసాయం, నీటి పారుదల, మున్సిపల్, తదితర శాఖల అధికారులతో ప లు అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో జా యింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, సిపిఒ ప్రేమ చంద్ర, డి ప్యూటి సిఇఒ అమృతరాజ్, డిపిఒ ప్రభాకర్, సర్వే, పంచాయతీరాజ్, ఆర్‌డబు ్ల్యఎస్, హౌసింగ్, వ్యవ సా య, మున్సిపల్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థుల బంగారు భవితకు బాట ప్రవేట్‌కు దీట్‌గా ప్రభుత్వ బడులు

## విద్యార్థులకు జగనన్న కిట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే పద్మావతి

## శ్రీ సీతారాముల దేవాలయం గుడికి భూమి పూజచేసిన ఎమ్మెల్యే

బుక్కరాయసముద్రం జూన్ 14 ప్రభాతవార్త

విద్యార్థులకు బంగారు భవితకు బాట ప్రవేట్ పాఠశాలలకు దీట్‌గా ప్రభు త్వం బడులను తీర్చిదిద్దిన ఘనత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. బుధవారం బుక్కరా యసముద్రం మండల పరిదిలోని రోటరీపురం గ్రామంలో శ్రీ సీతారాముల దేవాలయానికి భూమి పూజ నిర్వహించి అక్కడికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిం చారు. అనంతరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు జగన్న విద్యా కానుక కిట్లన్ పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగ వారు మాట్లడుతు చదువు మాత్రమే పేదవాడి తలరాతలను మారుస్తుందని బలంగా నమ్మిన ముఖ్యమంత్రి జగనోమ్హన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులనుతీసుకొచ్చారు. గత నాలుగేళ్ళల్లో విద్యారంగానికి 60వేల కోట్లు ఖర్చుచేసిం దన్నారు. దేశంలోనే ఎక్కడ లేని విధంగా బడులు తెరిచిన మొద టి రోజు నుంచి తల్లిదండ్రుల పై ఎలాంటి ఆర్థిక బారం పడకుండా విద్యా ర్థులకు అవసరమైన పాఠ్యపు స్తకాలు, నోట్స్ బుక్స్, బూట్లు తదితిర సామాగ్రితో నాణ్యమైన ఉచిత విద్యా కానుక కిట్ల్‌ను పంపిణీచేయడం జరిగిందన్నారు. అమ్మ ఒడి పథకం ద్వారా తల్లుల బ్యాంకుఖాతల్లో ఏడాదికి 15 వేలు అందజేయడం జరుగుతుంద న్నారు. ప్రభుత్వ పాఠశాల్లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టి కార్పొరేట్ చదువులు అందిస్తున్నారు. విద్యార్థులు మంచిగా చదవి ఉన్నత స్థాయికి చేరకుకొని తల్లిదండ్రులకు, గ్రామా నికి, మన రాష్ట్రం, దేశానికి మంచి పేరుతీసుకరావాలన్నారు. ఈ కార్యక్ర మంలో వైసిపి నాయకులు ఆలూరి రమణరెడ్డి, గ్రామ సర్పంచు కామాక్షి, వైస్ సర్పంచు శ్రీనివాసురెడ్డి, ఎంఇఓ గురుప్రసాద్, నాయకులు మండల ఎస్సీ సెల్ కన్వీనర్ వరికూటి కాటమ య్య, కాలవ నారాయణస్వామి, వజ్రం గంగరాజు, నాగ. నాగరాజు, మల్లేష్, తోపాటు ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితిరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు విద్యాకానుక కిట్ల్‌ను పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే,



సీతారాముల దేవాలయానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే

# టీడీపీ బలోపేతమే లక్ష్యంగా శ్రమించాలి

## - కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి పల్లె

నల్లమాడ జూన్ 14 ప్రభాతవార్త,

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ, రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని టీడీపీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మైలేశంకర నివాసం వద్ద ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వారికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై వేధింపులు, దౌర్జన్యాలు మితిమీరి పోయాయని, మరోసారి వైసీపీ అధికారంలోకి వేస్తే టీడీపీ కార్యకర్తలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవడం ఖాయమ న్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని టీడీపీ నాయకులు, కార్యకర్తలు వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయ్యేందుకు రెయ్యింబవల్లు శ్రమించాలని హితవు పలికారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తూనే అరాచకాలు, ఇసుక, మద్యం మాఫీయా జరుగు తోందన్నారు. టీడీపీ హాయాంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, అన్నీ వర్గాకు న్యాయం చేసి ఆదుకోవడం జరిగిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రైతు రుణ మాఫీ, డ్వాక్రా, చేనేత రుణమాఫీలు ఏ ఒక్కటి సక్రమంగా అమలు కాలేద న్నారు. ఒక్క అవకాశం ఇవ్వండంటూ పాదయాత్రలో ప్రజలపై ముద్దులు కురిపించిన జగన్, ఇప్పుడు పిడిగుద్దులతో అన్ని వర్గాల ప్రజలకు కోలుకోలేని విధంగా దెబ్బతీశారని ఆందోళన వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాల పేరుతో నామమాత్రంగా ప్రజ లకు చిల్లర డబ్బులు విదు ల్చుతూ కోట్లు అందేసినట్లు గొప్పలు చెప్పుకోవడం ఒక్క జగన్‌కే చెల్లిందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలు, నాయకులపై ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరు సైనికుల్లా పనిచేసి చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేసు కుందామని కార్యకర్తకలకు ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సామకోటి ఆదినా రాయణ, సర్పంచు ప్రభాకర్‌రెడ్డి, చంద్రారెడ్డి, సలాంఖాన్, అబ్బా స్ఖాన్, మైలేరామ చంద్ర, బుట్టి నాగభూషణంనాయుడు, పుట్లరవి, ప్రసాద్‌రెడ్డి, మైలే హరి, మధుసూ దన్‌రెడ్డి, శ్రీరాములు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పల్లెరఘునాథరెడ్డి

# రక్తదానం ప్రాణదానంతో సమానం - జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు

శ్రీసత్యసాయిజిల్లా(వైద్యం), జూన్ 14, ప్రభాతవార్త

రక్తదానమంటే ప్రాణదానం వంటిదని, సరైన ఆరోగ్యం, సాటి మనిషిని బ్రతికించాలనే దయా గుణం ఎవరైనా రక్తదానం చేయవచ్చని శ్రీసత్య సాయి జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని పుట్టపర్తిలోని ఎనుములపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సమయానికి రక్తం అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతుంటారని, అలాంటి ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తదానం చేస్తే మానవత్వమే మీకు పాదాభి వందనం చేస్తుందన్నారు. రక్త గ్రూపులను కనుగొన్న శాస్త్రవేత్త కార్ల్‌లాండ్ స్టీనర్ పుట్టిన రోజైన జూన్ 14ను ప్రపంచ రక్తదాన దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామన్నారు. రక్తదానం పట్ల ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి స్వచ్ఛంధంగా రక్తం ఇచ్చేలా ప్రోత్స హించాలన్నారు. రక్తదాం వల్ల ఎటువంటి బలహీనత రాదని, 350 మిల్లీలీటర్ల రక్తం మాత్రమే ఒక వ్యక్తి ఉండి సేకరించడం జరుగుతుందన్నారు. రక్తదాం గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుందని, క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుందని, ఆరోగ్యానికి మేలు చేస్తుందని, బరువు తగ్గడంలో సహాయ పడుతుందన్నారు. రక్తదానం కాన్పు సమయంలో, రోడ్డు ప్రమాదాలు జరిగి నప్పుడు, దీర్ఘకాలిక వ్యాధులతో సికిల్ సెల్ అనీమియా, క్యాన్సర్, తలసీమియా మొదలగు వ్యాధులు ఉన్న వారికి ఉపయో గపడుతుందన్నారు. ఈ శిబిరంలో 70 మంది స్వచ్ఛంధంగా రక్తదానం చేశా రు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డా.ఎస్.వి .కృ ష్ణారెడ్డి, జిల్లా లెప్రసి ఏయిడ్స్, టిబి అధికారి డా.తిప్పయ్య, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డా.కృష్ణయ్య, జిల్లా మలేరియా అధికారి డా.కు ల్లాయప్ప నాయక్, జిల్లా అంధత్వ నివారణ అధికారి డా.సి.అనురాధ, మెడి కల్ ఆఫీసర్ డా.నాగరాజునాయక్, సూప ర్వైజర్లు ఆర్.మురళీధర్‌రెడ్డి, బి.అబిద్ బాషా, ప్రాజెక్టు ఆఫీసర్లు ఈ.వి.రమణ, వై.రమేష్, వై.ఆంజ నేయులు, బాషా, మరియు ఆరోగ్య సిబ్బంది రాజేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు



రక్తదానం శిబిరాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

# రాష్ట్రంలో ఎక్కడా ఇలాంటి సహకార డెయిరీ లేదు

**( మొదటి పేజి తరువాయి )** ప్రకాష్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా ఉండాలి అని మంత్రి పిలుపునిచ్చారు.

**తల్లిపాలంత స్వచ్ఛంగా అమ్మ డెయిరీ పాలు : ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి :** ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. బతుకుతెరువు కోసం చేస్తున్న పోరాటంలో భాగంగా ప్రైవేట్ డెయిరీల దోపిడీకి మీ కష్టం వృథా కాకూడదనే ఉద్దేశ్యంతో, పులివెందులలో సహకార డెయిరీ ఏర్పాటు చేయాలనే వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కలను నిజం చేస్తూ బుధవారం రాప్తాడు నియోజకవర్గం ఆలమూరు వద్ద అమ్మ సహకార డెయిరీని నిర్మించుకున్నాం. రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయం లో తెలంగాణలోని ములకనూరు మహిళా సహకార డెయిరీని రెండుసార్లు సందర్శించారు. 25వేల మంది సభ్యులతో దాదాపు 200 కోట్ల రూపాయల టర్నోవంతో ఆ డెయిరీ సక్సెస్‌ఫుల్‌గా నడుస్తోంది. అలాంటి డెయిరీని పులివెందులలో ఏర్పాటు చేయాలని దివంగత నేత వైఎస్ఆర్ భావించారు. దురదృష్ట వశాత్తు ఆయన మరణించారు. ఆయన కలను సాకారం చేయాలని భావించి 2018 లో ముల కనూరు వెళ్లా, మహిళా సహకార డెయిరీలో మహిళల కష్టం ద్వారా వారు సేకరించినపాలకు మంచి ధరను ఇవ్వడమే కాకుండా ఏడాదికోసారి లాభాలను భాగాలుగా పంచిపెట్టే విధానాన్ని పరిశీలించాం. అలాంటి డెయిరీని ఏర్పాటు చేస్తామని ఎ న్నికల ముందు చెప్పా. గెలిచిన వెంటనే నేను, ఎంపి గంగయ్య మరోసారి ములకనూరు వెళ్లాం. కరోనా, ఇతర కారణాల వల్ల ఆలస్యమైనా ఏ ఒక్క మహిళపైన పైసా భారం పడకుండా 20 కోట్ల రూపాయలు ఖర్చు చేసి డెయిరీని నిర్మించి అక్క చెల్లె మ్మలందరికీ అప్పచెబుతున్నాం. రాప్తాడు నియోజకవర్గంలో దాదాపు 80 వేల కుటుంబాలున్నాయి. ఇందులో 10 వేలమ ంది అమ్మలు నడపబోతున్న ఈ డెయిరీలో నాణ్యమైన, చిక్కని పాలు, స్వచ్ఛమైన పాలను తయారు చేయ బోతున్నాం. తక్కిన 70 వేల కుటుంబాలకు ఈ పాలను అందజేయాలి. వారందరికీ భరోసా ఇస్తున్నా. అమ్మ మీ ఇంటికి తెచ్చేపాలు అమ్మ తన బిడ్డకు ఇచ్చేంత స్వచ్ఛంగా ఉంటాయి. మీరు చెల్లించే ప్రతి రూపాయి 10వేల మంది అమ్మలకు వెళ్తుంది. మధ్యలో ఎక్కడా దళారీలు ఉండరు. పెట్టుబడి దారులు లేరు. కార్పొరేట్ కంపెనీలు అసలేలేవు అని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి వెల్లడించారు. అమూల్ ఇస్తున్న ధరకంటే ఒకరూపాయి అదనంగా ఇస్తూ పాలను సేకరిస్తాం. అనంతపురం నగరంలో ఉన్న ప్రతి అమ్మకు విజ్ఞప్తి చేస్తు న్నా. చుట్టుపక్కల గ్రామాల నుంచి రైతులు నేరుగా వచ్చి ఇళ్లవద్ద పాలను పోస్తుంటారు. ఇలా 20వేల కుటుంబాలకు పాలను ఇస్తున్నారు. తక్కిన 80 వేల కుటుంబాల వారు తీసుకుంటున్న ప్రైవేట్ డెయి రీల పాలు స్వచ్ఛమైనవో కాదో చెప్పలేం. కానీ లాభాపేక్షతో చేస్తున్న వ్యాపా రం, వారికి ఆదాయం తప్ప మీ ఆరోగ్యం పట్ల బాధ్యత ఉండకపో వచ్చు. పాల స్వచ్ఛత పట్ల శ్రద్ధ ఉండకపోవచ్చు. అమ్మ డెయిరీలో మిగిలే సొమ్మంతా ఏడాదికోసారి వాటాలుగా వేసి 10వేల మంది సభ్యులందరికీ సమానంగా పంచుతాం. ఉమ్మడి జిల్లా అంటూ పాలను వి క్రయి స్తాం. లక్ష లీటర్ల నుంచి రాను న్న రోజుల్లో 10 లక్షల లీటర్ల పాలను సేకరించి జిల్లాలోని రైతులందరికీ అండగా ఉంటాం. డెయిరీ చైర్మన్ పర్సన్‌గా ఇన్ని రోజులు మా వదిన ఉండే ది. ఇప్పుడు తాత్కాలికంగా మా అమ్మ చైర్ పర్సన్‌గా వ్యవహరిస్తారు. మూనెళ్లలోపు ఎన్నిక జరుపుకొంటాం అని ఎమ్మెల్యే వెల్లడించారు. పేరూరు డ్యాంకు నీళ్లు తీసుకొస్తామని 2009లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మాట ఇచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో జీఓ వచ్చింది. ఆ తర్వాత పేరూరు డ్యాంకు నీళ్లు తీసుకొచ్చాం. వరుసగా మూడేళ్లు డ్యాంకు నింపాం. నాల్గో ఏడాది 25 టీఎంసీల నీటిని దిగువప్రాంతాలకు వదిలాం. రామగిరి బంగారు గనులు కూడా తెరిపించబోతున్నాం. పిఏబిఆర్ నీటి కోసం ముఖ్యమంత్రి రూ.65 కోట్లు మంజూరు చేశారు. మూడు రిజర్వాయర్లను మంజూరు చేశామన్నారు.

**యువత పెద్ద ఎత్తున చేపట్టిన బైక్ ర్యాలీ :** అమ్మ డెయిరీ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని యువత పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ చేపట్టింది. కళ్యాణదుర్గం రోడ్డు నుంచి రుద్రం పేట మీదుగా ఆలమూరు సమీపంలోని అమ్మ డెయిరీ వరకు బైకు ర్యాలీ సాగింది. వందలాది వాహనాలతో చేపట్టిన ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



సభలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సభలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

# క్షేత్రస్థాయిలో మంచి పేరు తీసుకురావాలి

## - కదిరి అర్బన్ ప్రాజెక్టు సిడిపిఓ రాధిక

కదిరి, జూన్ 14 ప్రభాతవార్త

అంగన్‌వాడీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో మంచి పేరు తీసుకువస్తేనే ప్రభుత్వానికి, అధికారులకు గుర్తింపు వస్తుందని కదిరి అర్బన్ ప్రాజెక్టు సీడిపిఓ రాధిక తెలిపారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని కుటాగుల సెక్టారు పరిధిలో జనబాగివాది కార్యక్రమం నిర్వహించారు. ఇందులోభాగంగా రెండున్నర సంవత్సరాలు పైబడి మూడున్నర సంవత్సరం లోపుగల పిల్లలను అంగన్‌వాడీకి ఆహ్వానించే కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని సిడిపిఓ తెలిపారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన చిన్నారులను అంగన్‌వాడీలకు ఆహ్వానించి పౌష్టికాహారం అందించడం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మమత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిడిపిఓ రాధిక